

# హరివిల్లు

● ఇచ్ఛాపురపు జగన్నాథరావు
● చిత్రాలు : భాస్కరన్

ఆవతలి గదిలో అర్చన తన సూట్‌కేస్ సర్దుకొంటోంది. డ్రాయింగ్ రూములో కూర్చునీ, నడుస్తూనూ, హరి తన ఓరిమి పూర్తిగా నశించిపోకుండా కాపాడుకునే ప్రయత్నాలు చేస్తున్నాడు.

ఉదయం తాను వెళ్ళేటప్పుడు అర్చన ఏమీ అనలేదు. వంటమనిషి రాకపోయినా ప్రశస్తమైన పెసరట్లు చేసి తినిపించింది. ఎప్పటిలాగనే త్వరగా వచ్చేయమని చెప్పింది. అప్పటికీ, మధ్యాహ్నం రెండు గంటలకీ మధ్యన ఏమైంది? తనకు ఫోన్ చేసి 'సాయంత్రం రైలుకి హైదరాబాదు వెడతాను' అని చెప్పింది. 'వెళ్ళనా?' అని అడగలేదు. వెడతానంది. 'టికెట్‌కి చెప్పేను' అంది. అంతే. ఆమెకీ, ఆ రైల్వేవాళ్ళ చీఫ్ భార్యకీ స్నేహం. అంచాత ఆమె కోసం స్పెషల్ ట్రెయిన్ వేయించాలన్నా వాళ్ళు తయారే.


'ఎందుకు?' అని అర్చనని అడగాలి అనిపించింది. ఇంతకుముందూ అలాగే అనిపించింది. కానీ, అడగలేదు. ఆమెని అలాటివి అడగాలి అనిపించదు. ఆమె వ్యక్తిత్వం అలాంటిది. పెళ్ళి అయిన ఈ రెండేళ్ళలోనూ అలాగ అడగలేకపోయాడు. ఇటుపైని అడిగే అవకాశం లేదు.

హరి టైము చూశాడు. ఇంకో అయిదారు నిమిషాలలో బయలుదేరకపోతే రైలు వెళ్ళిపోయే అవకాశం ఉంది. ఆమెని త్వరపెట్టే ఉద్దేశం అతనికి లేదు. రైలు వెళ్ళిపోతుందనే ఆశా లేదు. ఇలాంటి హఠాత్తు ప్రయాణాలు తప్పితే అర్చనలో తనకి ఏ లోటూ కనిపించదు. ఏ సమయంలోనూ ఆమె హరి మాట కాదనలేదు. తనకి ఆమె ప్రాణం. ఆమెకి తానూ అంతే. ఆ మాట అంతరాంతరాలలో హరికి తెలుసు. మలయమారుతాలలాటి ఆ భావనలలో ఇలాటి చిన్న చిన్న ఆలోచనలు సుతారంగా అవతలికి వెళ్ళిపోతాయి.

కానీ, ఈ రోజు హరికి ఆ మలయమారుతాలు సంతృప్తిని ఇవ్వడం లేదు. ఈమధ్య చదివిన ఒక కథ అతనికి మాటిమాటికీ జ్ఞాపకం వస్తోంది.

ఆ కథను రచయిత ఉత్తమ పురుషలో చెప్పేడు. తల నెరిసిన ఒక వ్యక్తి రైలులో ప్రయాణం చేస్తూ ఉంటాడు. వయసులో ఉన్న ఒక చక్కటి అమ్మాయి అతని కంపార్ట్‌మెంట్‌లో రెండో పాసింజరుగా వస్తుంది. ఒక యువకుడు ఆమెను కూర్చోపెట్టి తన సజల నయనాలతో ఆమె సజల నయనాలనించి సెలవు తీసుకుని, కదులుతోన్న రైలు దిగి వెళ్ళిపోతాడు. ఆ యువతి చాలాసేపు దుఃఖంతోనే ఉంటుంది. ఉపశమనం కూడా అపవిత్రమేమోనని రచయితకి అనిపించే దుఃఖం అది! ఆమె భర్తని ఎంతగా ప్రేమిస్తోందో గమనించిన కథకుడు ఈనాటి నడలుతోన్న సంసారాల అనుబంధాల మీద ఆలోచనలు సాగించుతూ ఆమెనీ, ఆమె భర్తనీ అదృష్టవంతులుగా భావించి, చూచాయగా కనిపించే ఆమె మంగళసూత్రాన్ని ఎంతో గౌరవంగా గమనిస్తాడు.

ప్రయాణం ముగిసే సమయంలో తెలుస్తుంది - ఆమె పుట్టినింటినించి



భర్త దగ్గరకి వెడుతోందని. ఆ కథ తనకి అంతగా జ్ఞాపకం రావలసిన అవసరం లేదు అని తెలిసిన హరికి తన మీద కూడా చికాకు కలిగింది. అర్చన ఏ పరిస్థితుల్లోనూ సిగ్గు పడవలసిన ఏ పనీ చెయ్యదు.

నిజానికి ఆ లక్షణమే అతన్ని అర్చనకి దగ్గరగా తెచ్చింది. ఒకసారి తాను హైదరాబాద్‌కి వెళ్ళినప్పుడు ఒక ఉద్యోగానికి అప్లికేషన్ పెట్టి ఇంటర్వ్యూకి వచ్చింది అర్చన. బి.ఎ మంచి మార్కులతో పాస్ అయి టైపు నేర్చుకుంది. ఆమెని చూడగానే హరికి కాంతిమంతమైన ఆమె కళ్ళు చాలా నచ్చాయి. ఏ పరిధిలో చూసినా ఆమె గొప్ప అందగత్తె అని అనుకోవడానికి ఆస్కారం లేదు గాని, ఆమెలో ఏదో హుందా ఉన్న ఆకర్షణ ఉంది. అందుకే ఆమెను చాలాసేపు కూర్చోపెట్టి, రకరకాల ప్రశ్నలు వేసి అనిష్టంగానే హరి పంపించాడు. కానీ, రెండో అభ్యర్థి ఇంటర్వ్యూ పూర్తి అయేదాకా ఆఫీసు వదిలి వెళ్ళిపోవద్దన్నాడు. రెండో క్యాండిడేటు-చూడగానే ఏమీ ఆకర్షణ లేని అబ్బాయి. బి.ఎ అత్తెసరుగా పాస్ అయి టైపూ, షార్ట్‌హేండూ, కంప్యూటరూ లాటివి నేర్చుకున్నాడు. బీద కుటుంబం. అర్చన కలవారి పిల్ల అని గమనించాడు హరి. అన్నివిధాలా ఆ అబ్బాయికే ఉద్యోగం ఇవ్వాలని నిర్ణయించి, ఆర్డరు రికార్డు చేసి అతన్ని పిలిచి చెప్పి, తరవాత అర్చనని పిలిచాడు.

తన నిర్ణయం ఆమెకి తెలియజేసి, "సారీ! మీకు ఆశాభంగం కలిగించి ఉంటాను" అన్నాడు హరి.

తేలికగా నవ్వి, "లేదు. వెంకట్ నా ఫ్రెండు. ఏ విధంగా చూసినా ఉద్యోగం అతనికే ఇవ్వాలి. మీరు మంచి పని చేశారు" అంది అర్చన. ఆ మాటలలోని సహజత్వం హరికి నచ్చింది.

"మీరు.... అలాగ అనుకున్నా ఉద్యోగం కోసం వచ్చాక కాదనడం నాకు బాగులేదు. కానీ, వేరే దారి లేదు" అన్నాడు హరి.

"మీరలాగ అనుకోవద్దు - నేను సరదాగా అప్లికేషన్ పెట్టేను. వస్తుందని కాదు. మిగిలిన ఇరవై ఇద్దరిలో నేను రెండో స్థానంలో రావడమే చాలు నాకు. ఉద్యోగం వచ్చినా కొద్దికాలం చేసి వదిలేసేదాన్ని. అది నిజం" అంది అర్చన.

హరి తేలికపడ్డాడు. ఆశగా వచ్చినవారికి నిరాశ చెయ్యడం అతనికి మామూలే అయినా, ఏదో నేరం చేసినట్టు చిన్న బాధ పడడం అతనికి అలవాటు. ఈసారి అలాటి బాధ లేకుండా వెనక్కి వెళ్ళవచ్చును అన్న భావన అతనికి సంతోషం కలిగించింది. ఆమె లేచి నిలబడింది.

"గుడ్. కానీ, మీరు వెళ్ళబోయే ముందు ఒక కోరిక" అన్నాడు. అతను అప్పటిదాకా ఏ అమ్మాయినీ ఆహ్వానించలేదు. కానీ, అర్చనని అంత త్వరగా వెళ్ళనివ్వడం అతనికి ఇష్టం లేదు.

"చెప్పండి. లంచ్‌కి పిలుస్తారా?" అంది చిరునవ్వుతో.

"అవును."

"వస్తాను. కానీ, బిల్ పంచుకోవాలి" అంది అర్చన దృఢంగా.

"కుదరదు. నా దగ్గర డబ్బు లేదు" అన్నాడు హరి, సంతోషంగా నిజం చెప్తూ.

"అయితే, అంతా నేనే పెడతాను."

"నాకు సిగ్గుగా ఉంటుంది!"

"మరి?... మీ దగ్గర డబ్బు లేకపోవడం ఏమిటి?"

"నా క్రెడిట్ కార్డ్ ఉంది. కంపెనీ ఖర్చు."

క్షణం ఆలోచించి సరేనంది అర్చన. అతను లేచి బయలుదేరుతోంటే హాలులో కృష్ణ కనిపించాడు. అతనికే ఆ రోజు ఉద్యోగం వచ్చింది. ఆర్డరు కోసం ఎదురుచూస్తున్నాడు.

"కృష్ణని కూడా రమ్మనండి" అంది అర్చన. అది సలహా కాదు. సూచన కాదు. అభ్యర్థనా కాదు. ఆదేశమూ కాదు. ఒక నిర్ణయం. అంతే.

ఆలోచనకి తావివ్వకుండా కృష్ణని కూడా హరి ఆహ్వానించాడు. కానీ, కృష్ణ ఆర్డరు తీసుకుని ఇంటికి వెళ్ళే ఆత్రతలో ఉన్నాడు. హరికి క్షమాపణ చెప్పి, అర్చనతో "మీ సాయానికి కృతజ్ఞత!" అన్నాడు.

"నేనేమీ చెయ్యలేదు. కానీ, మీరూ లంచ్‌కి వస్తే బాగుండును" అంది అర్చన.

"మావాళ్ళకి శుభవార్త చెప్పే ఆనందంలో మంచినీరు గూడా తాగే శక్తి లేదు నాకు. మీరు వెళ్ళండి" అన్నాడు కృష్ణ.

"అవును... గుడ్ లక్!" అని బయలుదేరింది అర్చన. ఆమెని అనుసరించాడు హరి.

లంచ్‌లో ఏమిటి తిన్నారో, ఏమిటి తాగేరో అతనికి ఎప్పుడూ జ్ఞాపకం రాలేదు. తన వివరాలు అర్చనా, ఆమె వివరాలు తానూ తెలుసుకోవడమూ రెండున్నర గంటలు ఏమేమో మాటలాడుకోవడమూ మాత్రమే అతనికి చూచాయగా

**అర్చన లేని ఇల్లు తలచుకొని హరి దిగులుపడ్డాడు. కానీ, ఆమె చాలా సంతోషంగా రైలు ఎక్కింది.**

జ్ఞాపకం ఉంది. అంతే. తాను తన కార్డు ఆమెకి ఇచ్చాడు. ఆమె తన అడ్రస్సూ, రెండు టెలిఫోను నంబర్లూ తన పుస్తకంలో రాసింది. ఆ పంక్తులని ఎంతో ఆప్యాయంగా పదే పదే చూసుకోవడం అతనికి జ్ఞాపకం ఉంది. ఆ తరవాత అతనికి హైదరాబాదు వెళ్ళడం చాలా సంతోషకరమైన విధిలాగ ఉండేది. మూడేళ్ళ సర్వీసులో అతను సెలవు పెట్టలేదు. కానీ, చుట్టాలని చూడడానికి అర్చన విశాఖ వస్తే, అతను చాలా గంటలు ఆమెతో గడపడం సహజంగా గడిచిపోయేది. ఆమెకానీ, అతనుకానీ సుమారు ప్రతిరోజూ టెలిఫోన్‌లో మాట్లాడుకునేవారు.

అలాగ మూడు నాలుగు నెలలు నిమిషాలలాగ గడిచిపోయాక, ఆమె అతనిని తన పుట్టినరోజు కోసం హైదరాబాదు ఆహ్వానించింది. తన విషయం అప్పటికే పసికట్టిన ఎం.డి అతని సెలవు అర్జీని చించిపడేసి, నవ్వుతూ కంపెనీ పని చిన్నది అప్పజెప్పి, హైదరాబాదు వెళ్ళమన్నాడు. ''ఈ వ్యవహారం తొందరగా ముగించు. హనీమూన్ తరవాత నువ్వు మళ్ళీ మనుమల్లో పడితే కంపెనీకి లాభకరంగా ఉంటుంది'' అన్నాడు నవ్వుతూ.

ఆ మరునటి నెలలో హరికీ, అర్చనకీ పెళ్ళి అయిపోయింది. పెళ్ళి చాలా ఆర్భాటంగా జరిగింది. అప్పుడుగానీ వాళ్ళు ఎంత శ్రీమంతులో హరికి తెలియలేదు.

పెళ్ళి అయిన నాలుగో రోజు అర్చన తన ఇంటికి వచ్చేసింది. ఇంట్లో వంటమనిషి ఉన్నా కొన్ని వంటకాలు అర్చన స్వయంగా చేసేది. అవి తినడం కష్టంగా ఉన్నా తిని ఇంకా కష్టపడి ఆమెని పొగుడుతూ ఉండేవాడు. అర్చన వాటిని రుచి చూసి, ''అబద్ధాలకి ఒక హద్దు ఉండాలి'' అనేది.

నాలుగు నెలల సహజీవనం తరవాత అర్చన ఒకనాడు హైదరాబాదు వెడుతున్నానని చెప్పింది. నాలుగు రోజుల తరవాత తిరిగి వచ్చింది.

ఇవాళలాగే ఆ రోజూ బయలుదేరింది. ఆమె లేని ఇల్లు తలుచుకుని హరి దిగులుపడ్డాడు. కానీ, ఆమె చాలా సంతోషంగా రైలు ఎక్కింది.

అలాగే చాలాసార్లు జరిగింది. ఇవేళ మళ్ళీ జరుగుతోంది.

వాచీ చూసి, గోడ గడియారం కూడా చూశాడు హరి.

అంతలోనే అర్చన సూట్‌కేస్ పట్టుకుని వచ్చింది. వెంటనే స్టేషన్‌కి బయలుదేరారు.

''రైలు అందుతుందా?'' అన్నాడు హరి.

''అందుతుంది'' అంది అర్చన.

రైలు అందింది. అర్చన కూర్చున్న మూడు నిమిషాలలో బయలుదేరింది.

హరి వెంటనే ఇంటికి వెడదామనుకున్నాడుకానీ, అతనికి ఆ ఆలోచన నచ్చలేదు. క్లబ్‌కి వెళ్ళి కొంచెంసేపు గడుపుదామని నిర్ణయించుకుని, పుస్తకాల షాపుకి నడిచాడు. అర్చన తిరిగి వచ్చేదాకా కాలం గడపడానికి రెండు పుస్తకాలు ఎంచుకునేసరికి పదిహేను నిమిషాలు పట్టింది.

''హల్లో హరీ!'' అన్న గొంతుకని అరక్షణంలో గుర్తుపట్టి, వెనక్కి తిరిగాడు. అవును. మాలిని.

''హల్లో! నువ్విక్కడ ఎందుకున్నావు?'' అన్నాడు అయోమయంగా చూస్తూ హరి.

''నా ఉత్తరం అందలేదా?''

''లేదు.. వస్తున్నట్టు రాశావా?''

''అవును మరి స్టేషనుకెందుకొచ్చావు?''

''అర్చన ఊరికి వెళ్ళింది...''

''ఓ!.. పోనీలే. అదృష్టంకొద్దీ నువ్వు దొరికేవు. నీ అడ్రస్ వెతుక్కుంటూ వచ్చేసరికి నా ప్రాణం పోయి ఉండేది. పద. ఇంటికి వెళ్ళి మాట్లాడుకుందాం.''

సామాను కారులో పెట్టించి, ఇంటికి బయలుదేరాడు హరి. ఈ రోజు డ్రైవరు రాకపోవడం మంచిదయిందని అనుకున్నాడు. అర్చన అటు వెళ్ళడమూ, మాలిని ఇటు రావడమూ కొంతమందికి చాలా వింతగానూ, చాలామందికి కొంత వింతగానూ కనిపించక తప్పదు.

''ఏమిటి ఈ హఠాత్ ఆగమనం?'' అని అడిగాడు హరి కొంచెం దూరం వెళ్ళేక.

''మా చుట్టాల అమ్మాయి పెళ్ళి. ఘనత వహించిన శ్రీవారికి రావడం కుదరక నన్ను నియోగించారు.''

''మరి - పెళ్ళివారింటికి వెళ్ళాలా? ఎక్కడ?'' అన్నాడు హరి, కొంత ఆశగా.

''తొందరపడకు. ఒకప్పుడు నీ అర్ధాంగిని అవుదామని అనుకుని, నిన్ను హడల గొట్టేను. ఆ తరవాత ఆ ప్రయత్నం విరమించుకుని నిన్ను సుఖపెట్టేను. ఇవేళ నీ అతిథి సత్కారాలు వద్దని ఆ పెళ్ళివారి ఇంటికి వెళ్ళిపోతే నీ మనసు దుఃఖపడిపోతుంది. అవునా?''

హరి నవ్వే ప్రయత్నం చేశాడు.

''అవునూ - నా ఉత్తరం నిజంగా అందలేదా? లేక అందినా అందలేదని చెప్తున్నావా?... అలా అవదులే. నీకు అబద్ధాలాడడం రాదు. నాకు జ్ఞాపకం ఉంది. నీకూ ఉందా'' అని మాలిని ఆగింది.

అతనికి ఆమె గుర్తు చేస్తున్న ఉదంతం సులువుగానే గుర్తుకి వచ్చింది. అప్పుడు తాను ఎం.బి.ఎలో ఉన్నాడు. ఆ రోజుల్లో మ్యూజిక్ అంటే సరదా ఉండేది. ఒక మ్యూజిక్ క్లబ్‌లో సభ్యుడిగా ఉండేవాడు. వారానికొకసారి ఏదో ఒక ప్రోగ్రాం ఉండేది. అక్కడ మాలిని తరచుగా కనిపించేది. తనని చిరునవ్వుతో పలకరించేది. తను కూడా ఎలాగో చిరునవ్వు తెచ్చుకుని పలకరించేవాడు. ఆమె గలగలా అందరితోనూ కబుర్లు చెప్తూ, చాలా సరదాగా ఉండేది. చాలా అందంగానూ, ఆకర్షణీయంగానూ ఉండేది. తన మనసులో ఆమె అంటే చాలా ఇష్టంగా ఉన్నా చొరవ తీసుకుని ఆమెని పలకరించి దగ్గరగా వెళ్ళే సాహసం ఉండేది కాదు. అంచాత ఆమెని తప్పించుకుని తిరిగేవాడు. అయినా, మాలిని చిరునవ్వులతో పలకరింపులు మొదలుపెట్టి, క్రమంగా తనని వెదికి వచ్చి మరీ సంభాషణ మొదలుపెట్టేది. ఆ రోజుల మొదటిలో ఒకసారి తన పక్కన వచ్చి కూర్చుని, ''హరీ! నేనంటే ఎందుకు భయం?'' అని అమాయకంగా అడిగింది, ఏ ఉపోద్ఘాతమూ లేకుండానే.

కొంచెం తడబడీ, అది దాచుకుని ''మీరంటే భయం లేదు..'' అన్నాడు హరి.

''మరి అమ్మాయిలంటే భయమా?''

''కాదు...''

''అయితే, నా పేరు చెప్పండి. మూడు నెలలనించి ప్రతివారం పనిగట్టుకుని మీ దగ్గరికి వచ్చి చిరునవ్వుతో పలకరించినా, కరెంటు లేని ట్యూబులైటులాగ మీరు అలాగే ఉండిపోతారేం? ఒక్కసారి, హల్లో అనవచ్చుగదా! అసలు నా పేరు తెలుసునా?''

''తెలీదు'' అని అంగీకరించాడు హరి.

''మాలిని. గుర్తు పెట్టుకోండి. మీ వివరాలన్నీ నాకు తెలుసు. మీకు వయొలిన్ అంటే ఇష్టమనీ తెలుసు. నేర్చుకుందామనుకున్నాను. నాలుగు లెసెన్సుకి వెళ్ళేను కూడా. కానీ, అది నా ఒంటికి పడలేదు. పిటీ!....'' అంది.

''వయొలిన్ కన్నా మీ మాటలు బాగున్నాయి'' అన్నాడు హరి, మనసారా.

మాలిని ఎంతో అందంగా, ఆనందంగా నవ్వింది. ''నైస్ కాంప్లిమెంట్. మరి నేను బ్యూటిఫుల్ గర్ల్ అంటారు చాలామంది. మీరేమంటారు?'' అంది అమాయకంగా ముఖం పెట్టి.

''వాళ్ళందరూ నిజమే చెప్తున్నారు'' అన్నాడు హరి, కష్టపడకుండా.

''థాంక్యూ!.. మీ కాంప్లిమెంట్స్ వింటూ కూర్చుంటే మనలని చాలా జాగ్రత్తగా గమనిస్తోన్న చాలామంది మనం ప్రేమికులం అనుకుంటారు.. వెళ్ళేదా?'' అంది మాలిని లేవకుండానే.

''మీ ఇష్టం'' అన్నాడు హరి. నిట్టూర్పుతో ఆమె వెళ్ళిపోయింది. మరో రెండు వారాలు ఆమె దూరంనించే కళ్ళతో పలకరించింది. హరి అంతకన్నా దగ్గరగా వెళ్ళే ప్రయత్నం చెయ్యలేదు.

ఆ తర్వాత క్లబ్ సభ్యులందరూ ఒక వారం పిక్నిక్‌కి బయలుదేరారు. పాతికమంది ఉన్నారు. హరి కూడా అందులో ఉన్నాడు. కొండల మధ్య అడవిలో అందరూ దిగి కాఫీలు తాగి, కొంతమంది సంగీత కచ్చేరీలు చేస్తూ, మరికొంతమంది పేకాట ఆడుతూ నిమగ్నమైపోయారు. ఐదారుగురు భోజనాల ఏర్పాట్లు చేస్తున్నారు. ఒక మైలు అవతల పాడుపడిన దేవాలయం ఒకటి ఉంది. అంతదాకా కాలిబాట ఉంది అని తెలుసుకుని హరి అక్కడికి నడక సాగించాడు. పట్టణవాసం తరవాత ఆ అడవీ, కొండలూ, నిశ్శబ్దమూ కలసి అతని మనసులో ఎంతో ఉత్సాహాన్ని కలిగించాయి. నడిచి నడిచి ఆ గుడి చేరేడు. అనుకున్నదానికన్నా ఎక్కువ దూరంలాగ ఉన్నా ఇరవై నిమిషాల నడక మాత్రమే. కొంచెం అలసిన హరి ఒక రాతి మీద కూర్చుని దూరంగా కనిపిస్తోన్న కొండలనీ, వాటి ముందు ఉన్న అడవులనీ గమనిస్తూ గడిపేడు. ఆ ప్రశాంతతనీ, ఆ సౌందర్యాన్నీ ఏం చేసుకోవాలో అతనికి బోధపడలేదు. కొద్ది నిమిషాల తరవాత అతనికి నిద్ర వచ్చింది. కూర్చునే కళ్ళు మూసుకున్నాడు.

''హల్లో!'' అన్నమాటకి తెలివి వచ్చి కళ్ళు తెరిచాడు. ఎదురుగా నవ్వుతూ మాలిని.

''నువ్వెప్పుడు వచ్చావు?'' అని అడిగి, దిద్దుకుని బహువచనంతో మళ్ళా అడిగాడు.

''ఆ పిలుపే బాగుంది హరీ! మరీ ముసలివాళ్ళలాగ మీరూ, తమరూ ఏమిటి? పవిత్రమైన ఈ దేవాలయం సాక్షిగా, పంచభూతాల సాక్షిగా ఇటుపైని మనం ఏకమైపోదాం. గాబరాపడకు - ఏకవచనాలైపోదాం. ఏం?'' అంది పక్కనే కూర్చుంటూ.

''అలాగే..కానీ, బస్‌లో నువ్వు కనపడలేదు....'' అన్నాడు హరి.

''ఎలా కనిపిస్తాను? మరీ ఆరు గంటలకి లేచి, ఎనిమిదికి ఇల్లు వదలాలంటే ఎలాగ?''

''మరి ఎలాగ వచ్చావు?''

''కారులో - ఇల్లు దాటడం ఏమిటి - డ్రైవర్‌ని వెనక సీటులోకి పంపి నేను స్టీరింగ్ పట్టుకున్నాను. ముప్పైమైళ్ళూ నలభైతొమ్మిది నిమిషాలలో వచ్చేశాం. డ్రైవరుకి గుండె ఆగిపోయిందిట. మళ్ళీ నిజంగానే కొట్టుకుంటుందా అని

**[illegible] విహరిస్తోందో లేక క్షణికోద్రేకానికి పశ్చాత్తాప [illegible] చాలాసేపు అతనూ మాట్లాడలేదు. అలాగ ఎంతసేపు గడిచిందో!**



అందరినీ అడుగుతూ మాటిమాటికీ మంచినీళ్ళు తాగుతున్నాడు. బాధపడకు. ప్రాణభయం లేదులే'' అంది ఏకధాటిగా మాలిని.

ఆమె సాన్నిహిత్యం అతన్ని పెనవేసుకుంది. ఆ ఏకాంతంలో ఏం చేసుకోవాలో అతనికి తెలిసివచ్చింది. కానీ, అతి కష్టాన తన ఉద్రేకాన్నీ, ఊహాలనీ అదుపులో పెట్టుకున్నాడు.

''గుడిలో ఏముంది?''

''చూడలేదు.. ఏమీ ఉండదనుకుంటాను..''

మాలిని నవ్వి ''గుడి కోసం ఇంత దూరం వచ్చి లోపల ఏముందో చూడకుండా నిద్రపోతున్నావా హరీ'' అంది. అతను లేచి నిలబడ్డాడు. మాలిని చెయ్యి అందించింది. జాగ్రత్తగా పట్టుకుని లేవదీశాడు. అతను వదలబోతోంటే, ఆమె అతని చెయ్యి పట్టుకుని ''పాణిగ్రహణం కాదులే! ఆడపిల్లని.. ఇలాటి చోట్ల భయం నాకు'' అంది సీరియస్‌గా. హరికి బాగానే ఉందికానీ, పాణిగ్రహణం అన్న మాట అతనికి కొంత భయం కలిగించింది. ఈ అమ్మాయి తనకి భార్యగా వస్తే ఎలా ఉంటుందో అని క్షణకాలం ఊహించుకుని ఆగిపోయాడు.

గుడిలో పాడు అయిన విగ్రహం ఏదో ఉంది.

''అది తలపులమ్మ విగ్రహం! ఆ విగ్రహానికి ముందు నిలబడి చెయ్యీ చెయ్యీ పట్టుకుని ఏ జంట వచ్చినా, వాళ్ళకి పెళ్ళి అయిపోతుందిట - నేను విన్నాను'' అంది మాలిని, అతని చేతిని గట్టిగా పట్టుకుని.

నవ్వి ఊరుకున్నాడు హరి.

హఠాత్తుగా మాలిని అతన్ని కౌగిలించుకుని, పెదవులమీద ముద్దు పెట్టుకుంది. క్షణమాత్రం అతను వివశుడైపోయాడు. అతనికి తెలియకుండానే అతని చేతులు ఆమె ఒంటి చుట్టూ బిగుసుకున్నాయి. ఆ నిజం గ్రహించగానే హరి తన చేతులని వెనక్కి తీసేసుకున్నాడు. ఆమె కూడా అతన్ని వదిలేసి బయటికి నడిచింది.

ఆమె నిశ్శబ్దంగా రాతిమీద కూర్చుంది. అతను నిలబడ్డాడు. ఆమె ముఖంలోని భావాలను చదివే ప్రయత్నం త్వరగా విరమించుకున్నాడు. ఆ అనుభూతిని నెమరువేస్తూ ఆమె కలలలో విహరిస్తోందో లేక క్షణిక ఉద్రేకానికి పశ్చాత్తాపపడుతోందో అతనికి తెలియలేదు. చాలా సేపు అతనూ మాట్లాడలేదు.

అలాగ ఎంతసేపు గడిచిందో! అతనూ కూర్చుని తన తలలోని గజిబిజి ఆలోచనలని ఒక మార్గానికి తెచ్చేందుకు విఫలంగా ప్రయత్నించాడు. ఆ అనుభవం ఎంతో బాగుంది. కానీ, అది నిత్యమూ, సొంతమూ కావాలంటే కట్టాల్సిన ఖరీదు అతని దగ్గర లేదు. తాను జీవితం లోతుగానూ, మెల్లగానూ సాగే మందాకినిలాగ ఉండాలని కోరుకుంటాడు. ఆమె అలకనందలాగ తుళ్ళుతూ, గెంతుతూ పరుగులు పెట్టే మనిషి.

చాలా సేపటి తరవాత మాలిని లేచి నిలబడింది. ''వెడదామా? వాళ్ళందరూ మన కోసం చూస్తూ ఉంటారు'' అంది. ఏమీ జరగనట్టే ఆమె మాటలాడింది.

అతనూ లేచాడు. అరగంటలో పిక్నిక్ స్పాట్‌కి చేరేరు.

''ఏం చేశారింతసేపూ'' అని అడిగారు మిత్రులు.

''గుడి దగ్గర కూర్చున్నాం'' అంది మాలిని.

''అంతేనా?'' అందొక అమ్మాయి.

''కాదు. ఆమె నన్ను ముద్దు పెట్టుకుంది'' అన్నాడు హరి. అందరూ నవ్వేరు. మాలిని కూడా.

* * *

కారులో కూర్చున్న మాలిని ''ఇంకా ఎంత దూరం'' అంది నవ్వుతూ.

''రెండు నిమిషాలు..... వచ్చేశాం'' అన్నాడు హరి.

ఇల్లు దిగేసరికి బహదూర్ ఉన్నాడు. వెళ్ళి, సామాను తెచ్చి లోపల పెట్టి ''ఖానా తయారుచేసేదా'' అన్నాడు.

''రోజంతా ఎక్కడికెళ్ళేవు?''

''శాదీ ఉంది. అమ్మగారికి చెప్పేను'' అన్నాడు బహదూర్. మాలిని కలుగజేసుకుని ''డిన్నర్‌కి తీసికెళ్ళు - లేకపోతే ఈ ఊరు వచ్చిన సరదా ఉండదు'' అంది.

ఆ రాత్రి మాలినీ, హరీ డిన్నర్‌కి వెళ్ళేరు. మాలిని చాలా ఉత్సాహంగా ఉంది. హరి అంత ఉత్సాహంగా లేడు. అతనికి తెలిసిన ముగ్గురు, నలుగురు రెస్టారెంట్‌లో కలసి అతన్ని పలకరించారు. ఆమెని మాలినిగానే పరిచయం చేసి, నాగరికంగా అవతలివాళ్ళు ఇంక ఏ ప్రశ్నలూ వెయ్యనందుకు సంతోషించాడు.

రాత్రి ఇంటికి వచ్చేసరికి పన్నెండు అయింది. డిన్నర్ ముగిశాక చాలాసేపు సముద్రం పక్కన కూర్చున్నారు. మాలిని ఎక్కువగా తన కార్యకలాపాలని గురించి చెప్పింది. ఆమె మాటలలో భర్త మీద ప్రేమా, జీవితం మీద సంతృప్తే కనిపించాయి హరికి.

''నిన్ను రమ్మన్నారు. మీ ఇద్దరినీ.''

''కలకత్తా వచ్చి ఏం చేస్తాను?''

''నా ముఖం చూస్తావు. లేకపోతే కళ్ళు మూసుకుని పడుకుంటావు- వద్దులే. అవన్నీ ఇమాజిన్ చెయ్యకు. డార్జిలింగ్ వెడదాం. మా టీ ఎస్టేటులో నాలుగు రోజులు గడుపుదాం'' అంది మాలిని.

''అలాగే..'' అన్నాడు హరి.

రాత్రి తన బెడ్‌రూమ్‌లోకి వెడుతూ ''నువ్వు లోపల గడియ పెట్టుకోకు హరీ! నిద్రలో భయం వేస్తే నీ దగ్గరకి వస్తాను'' అంది మాలిని.

హరి ఆ రాత్రి నిద్రపోలేదు.

మర్నాడు మాలిని చాలా ఆలస్యంగా నిద్ర లేచింది. టీ తాగుతూ ''ఇవేళ ప్రోగ్రాం ఏమిటి?'' అంది. నిన్నటినించీ ఆమె అర్చనని గురించి ఏమీ అడగలేదు.

''నువ్వు చెప్పు'' అన్నాడు హరి.

''లంచ్ అవగానే మరొకసారి సముద్రం చూపించు. ఎండలో ఎలాగ ఉంటుందో చూడాలి'' అంది మాలిని.

ఇన్నాళ్ళూ హరి ఆ పక్కనించి ఎన్ని వందలసార్లు వెళ్ళినా చీకటిలోనూ, వెన్నెట్లోనూ, ఎండలోనూ, వర్షంలోనూ అదే సముద్రం ఎంత భిన్నంగా ఉంటుందో ఆలోచించలేదు. ఆమె చెప్పినదానికి అంగీకరించాడు.

మరో కప్ టీ అడిగి, నైటీతోనే మాలిని గార్డెన్‌లోకి వెళ్ళింది. అర్చనకి ఆ గార్డెన్ అంటే చాలా సరదా. అడిగినది ఇచ్చి మనిషిని పెట్టి రకరకాల మొక్కలూ, పాదలూ పెంచింది. పది పన్నెండు పెద్ద చెట్ల మధ్య ఆ ఉద్యానం చాలా చక్కగా ఉంది.

''బ్యూటిఫుల్ గార్డెన్! రాత్రి చూడలేదు. చీకటి'' అంది మాలిని.

''అర్చన శ్రమ అది.. ఆమెకి చాలా ఇష్టం'' అన్నాడు హరి.

''బ్యూటిఫుల్!''

లంచ్ అయాక కొంచెం రెస్టు తీసుకుంటానంది మాలిని. ఆమె కొంచెం ఒళ్ళు చేసి అప్పటికన్నా బాగుంది. ఆ మాట ఆమెకి చెప్పాలనుకున్నాడు హరి. సందర్భం కోసం ఎదురుచూశాడు.



అతనికి కళ్ళు మండుతున్నాయి. రాత్రి నిద్దర లేదు. పడుకుంటే నిద్ర పట్టేసింది. లేచేసరికి ఐదయింది.

గుమ్మంలో నిలుచుని మాలిని నవ్వుతూ, "పగలు అయినా బాగా నిద్ర పోయావు. అందుకేనా? భయం లేకుండా?" అంది.

"రాత్రి నిద్రలేక......" అన్నాడు హరి.

"ఎందుకో?" అంది మాలిని.

ఆ సాయంత్రం ఆమెని పెళ్ళివారి ఇంట్లో విడిచి వచ్చాక టీ తాగుతూ ఆలోచనలో పడ్డాడు హరి. ఇలాగ ఆదివారాలు వస్తే ఏ సినిమాకో, మిత్రుల ఇళ్ళకో వెళ్ళడం అతనికీ, అర్చనకీ అలవాటు. ఈ సరికి అర్చన వాళ్ళ ఇంట్లో ఉంటుంది. ఆమెని రైల్లో కూర్చోబెట్టడమూ, చెయ్యి ఊపడమూ అతనికి జ్ఞాపకం వచ్చింది. వెనువెంటనే అతనికి ఆ కథ మళ్ళీ జ్ఞాపకం వచ్చింది. "ఛీ! ఏమి ఆలోచనా? అర్చనని గురించా? నెవర్! నెవర్!" అనుకున్నాడు.

లోపలికి వెళ్ళి హైదరాబాదుకి డయల్ చేశాడు. సర్వెంట్ ఎత్తాడు ఫోన్. అర్చన ఇంట్లో లేదు. అమ్మగారు ఉన్నారు.

తానెవరో చెప్పకుండానే ఫోన్ పెట్టేసి, గార్డెన్‌లోకి వచ్చి కూర్చున్నాడు. పుస్తకం తీసి చదవసాగాడు. పదిన్నరకి మాలిని కోసం వెళ్ళాలి. అప్పటికి పెళ్ళి విందూ ముగుస్తాయి.

అర్చన పదే పదే జ్ఞాపకం వచ్చింది. కొన్ని ఆలోచనలకి అతను సిగ్గుపడ్డాడు. నిష్కల్మష మైన ఆమె కళ్ళ వెనుక అపరిశుభ్రమైన ఆలోచనలేవీ ఉండవని అతనికి తెలుసు.

ఆ కథ చదివి ఉండకపోతే బాగుండేది - లేచి బట్టలు వేసుకుని క్లబ్‌కి నడిచాడు. అక్కడ ఒక బీరు తాగి, డిన్నర్ అయిందనిపించి, పదిన్నరకి పెళ్ళి ఇల్లు చేరేడు. మాలిని సిద్ధంగా ఉంది. దారిలో పది నిమిషాలు కారు ఆపి, దిగకుండానే సముద్రాన్ని చూసి, అతనూ మాలినీ ఇంటికి వచ్చేశారు. ఆమె బాగా అలిసిపోయి ఉంది. స్నానం చేసి, టీ తాగి నిద్రపోయింది.

ఆ మరునాడు ఆమె తిరిగి వెళ్ళిపోయింది. రెండు రోజుల్లో అర్చన రావచ్చుననీ, ఉండమనీ హరి పట్టు పట్టినా ఆమె ఆగలేదు. రిటర్న్ టికెట్ ముందరే తెచ్చుకుంది.

"ఈ రెండు రోజులూ నీతో అద్భుతంగా గడిచాయి హరీ! మళ్ళీ మనం పిక్నిక్కి వెళ్ళి గుడి దగ్గర కలిసినట్టే ఉంది" అంది మాలిని, ప్లాట్‌ఫామ్ మీద నిలబడి రైలు నిర్గమనం కోసం ఎదురుచూస్తూ. హరికి ఆ రోజూ, ఆ గుడీ, ఆ నిమిషమూ గుర్తు వచ్చాయి. ఆ జ్ఞాపకం అతని కళ్ళలో ప్రతిఫలించింది.

"గుడ్. నువ్వు మరిచిపోలేదు. నాకది చాలు...." అంది మాలిని, లోపలికి వెళ్ళిపోతూ. అద్దాలలోనించి లోపలి ఆ అమ్మాయి అతనికి కనిపించలేదు. నెమ్మదిగా తిరిగి వచ్చి ఆఫీసుకి వెళ్ళిపోయాడు. మాలిని రావడమూ, తిరిగి వెళ్ళిపోవడమూ - అంతా ఒక కలలాగ ఉంది. జీవితంలో భార్యకాని ఆడపిల్ల తనని ఒక్కసారే ముద్దు పెట్టుకుంది. అదే మొదటిసారి. అదే చివరిసారి.

ఆఫీసులో చాలా పని ఉంది. నిమగ్నమైపోయి తేలికపడ్డాడు హరి. సాయంత్రం ఇంటికి వెళ్ళగానే అంతా బోసిగా కనిపించింది. అర్చన వచ్చేస్తే బాగుండుననుకుంటూనే చాలా ఆలస్యంగా నిద్రపోయాడు. ఉదయం అతన్ని తట్టి లేపుతూ "ఏడు దాటింది... లెండి" అంటోంది అర్చన.

కల ఏమోననుకుంటూ కళ్ళు విప్పేడు హరి.

"ఎప్పుడొచ్చావు" అన్నాడు.

"పది నిమిషాలైంది."

"బెల్ కొట్టలేదా?"

"లేదు - రాత్రి మీరు లోపలి గడియ వెయ్యడం మరిచిపోయారులా ఉంది. తాళం తీసుకుని వచ్చేశాను."

"గుడ్.... మీ వాళ్ళంతా బాగున్నారా?"

"ఆఁ!... తీరిక చూసుకుని మిమ్మల్ని రమ్మన్నారు."

అతను లేచి ముఖం కడుక్కుని టీ చప్పరిస్తూ, అర్చన కళ్ళలోకి చూశాడు. ఎప్పటి కళ్ళో అవి. ఎప్పుడో గడిచిపోయిన ప్రథమ సమాగమం రోజున, ఇంటర్వ్యూకి వచ్చి ఎదురుగా కూర్చుని తన కళ్ళలోకి చూస్తోన్న అవే కళ్ళు.

**"పాపం మాలిని... ఎంత మనసో ఆమెకి మీమీద! కానీ..." అంది అర్చన. "అదంతా ఎప్పుడో ముగిసింది అర్చనా! నీకు తెలుసు" అన్నాడు హరి.**

**"ఒక విధంగా ఆ కథ ముగిసిపోయింది... మరొక విధంగా ఇది ఎన్నటికీ ముగియదు."**



టీ తాగి పేపరు చదివి, స్నానం చేశాక బ్రేక్‌ఫాస్ట్‌కి కూర్చుంటూంటే ఉప్మా వడ్డిస్తూ "గెస్ట్ ఎవరో వచ్చారట?" అంది అర్చన.

కొంచెం కంగారుపడ్డాడు హరి.

"అవును - మాలిని వచ్చింది" అన్నాడు.

"వెళ్ళిపోయిందా?"

"నిన్న వెళ్ళింది. పెళ్ళికి వచ్చింది.ఎవరో చుట్టాలుట. నీకెవరు చెప్పేరు?" అన్నాడు హరి.

"బెడ్‌రూములో ఆమె డ్రెస్ పడి ఉంది. బహదూర్‌ని అడిగితే చెప్పేడు."

"ఆ అమ్మాయి కొంచెం కేర్లెస్‌లే."

"భోజనాలకేం చేశారు? బహదూర్ చేతివంట పెడితే ఆమె మళ్ళీ రాదు" అంది అర్చన, నవ్వుతూ.

"ఫరవాలేదులే. మూడు పూటలలో ఒక్కసారే ఇంట్లో..."

అతను తినడం ముగించి లేచాడు.

"మాలిని అంటే — నాకు తెలుసునా?"

"తెలీదు. వస్తుందనీ తెలీదు. ఉత్తరం రాసిందిట. అందలేదు. నీ రైలు వెళ్ళగానే స్టేషన్‌లో కనిపించింది...."

"నయమే. మెయిల్లో వచ్చి ఉంటుంది. ఆవేళ గంటల కొద్దీ లేటుగా వచ్చింది."

హరి తల ఊపి ఆఫీసుకి బయలుదేరాడు. నగం దూరం వెళ్ళాక అతనికి గుర్తు వచ్చింది, మాలిని గురించి అర్చన అడగకుండానే అడిగింది అని.

హరి ఆ సాయంత్రం డ్రైవర్ని పంపేసి, అర్చనని తీసుకుని ఊరికి పదిమైళ్ళ అవతలిదాకా వెళ్ళేడు. అక్కడ సముద్రం చూస్తూ రోడ్డు పక్కన కూర్చుని "మాలిని గురించి అడిగావు" అన్నాడు.

"నాకు తెలుసునా అన్నాను..." అంది అర్చన.

"తెలీదు. ఒక విధంగా అది నా రొమాన్సు - కాదు - ఆమె రొమాన్సు" అంటూ మొదలు పెట్టి, ఆమెకి ఆ రోజుల కథ అంతా చెప్పేడు. మాట్లాడకుండా విని అర్చన ఆలోచనగా "మీరు అదృష్టవంతులు...." అంది.

"అవును. నాకు నువ్వు దొరికావు!"

"అది కాదు నా ఉద్దేశం. ప్రేమించిన మనిషి అదృష్టవంతుడు. కానీ, ఎవరి ప్రేమకైనా నోచుకుంటే అది నిజమైన అదృష్టం!.." అంది అర్చన. ఆమె కళ్ళలో ఎన్నో రంగులు... కాంతిగా ఉన్న రంగులు.

చిరుచీకటిలో లేచి వెళ్ళి ఇద్దరూ కారులో కూర్చున్నారు.

పది నిమిషాల నిశ్శబ్దం తరవాత "పాపం మాలిని" అంది అర్చన.

అతనొకసారి ఆమె వైపు చూసి, హెడ్‌లైట్ల కాంతి కిరణాల మీద దృష్టి నిలిపేడు.

"ఎంత మనసో ఆమెకి మీ మీద! కానీ..." అంది అర్చన.

"అదంతా ఎప్పుడో ముగిసింది అర్చనా! నీకు తెలును."

"తెలుసును. ఒక విధంగా ఆ కథ ముగిసిపోయింది. లేకపోతే మాలిని అంత చనువుగా వచ్చి, అంత స్వేచ్ఛగా మన ఇంట్లో ఉండగలిగేది కాదు. కానీ, మరొక విధంగా ఇది ఎన్నటికీ ముగియదు...."

హరికి కొంచెం అర్థమైంది. మాలిని మాత్రమే కాదు - అర్చన కూడా. అతనేమీ మాట్లాడలేదు.

ఇంట్లోకి వెళ్ళి తన పనుల్లో నిమగ్నమైపోయింది అర్చన. గార్డెన్‌లో కూర్చుని వివరీతమైన ఆలోచనలలో పడ్డాడు హరి. అతను అర్చన మాటలలోని పూర్తి అర్థాన్ని గ్రహించడం కోసం చాలా ఆలోచించాడు. కొన్ని జవాబులు వచ్చాయి. కానీ, ఈ ప్రశ్నలకి ఒకే జవాబు ఉండాలి. అది ఏమిటి?

ఆ రాత్రి అర్చన స్నానం చేసి, తెల్లటి చీర కట్టుకుని వచ్చింది. సుగంధ పరిమళంతో దైవం మానవుడికిచ్చిన వరంలాగ ఉంది ఆమె.

కొంచెంసేపు అయాక "ఒకటి అడుగుతాను చేస్తారా" అంది.

"చేస్తాను. చెప్పు."

"కలకత్తా వెడదాం-"

"ఎందుకని?"

"మాలినిని చూడాలి.."

"చూసి? ఏం చేస్తావు?"

"ముద్దు పెట్టుకుంటాను... ఇలా...."

జీవితంలో మొదటిసారిగా హరికి ఏడు రంగుల కలయిక తెల్లటి కాంతిగా ఎలా మారుతుందో తెలిసింది. అతను ఆలోచనలని కట్టిపెట్టేశాడు. వాటి అవసరం లేదు. అనుభూతి కావాలి. అంతే. ■